సాక్షి
నిర్మల్
గురువారం : 9 : మే : 2024



12వ తేదీలోగా రండి

వేసవి సెలవులు కావడంతో జిల్లాకు చెందిన పలువురు టూర్లకు వెళ్లారు. ఈ నెల 13న ఎంపీ ఎన్నికల పోలింగ్ ఉండగా ఒకరోజు ముందే రావాలని అధికారులు సూచిస్తున్నారు. IIలో▸



భూసార పరీక్షలకు వేళాయె

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఫలితాలకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని చెబుతున్నారు. IIIలో▸

గరిష్ఠం/కనిష్ఠం
39.0 / 27.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా వర్షం పడే అవకాశముంది.

న్యూస్‌రీల్

13న వేతనంతో కూడిన సెలవు

నిర్మల్‌చైన్‌గేట్: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బందికి వేతనంతో కూడిన సెలవు మంజూరు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలు తప్పకుండా పాటించాలని, సెలవును సద్వినియోగం చేసుకుని ఓటు వినియోగించుకోవాలని సూచించారు.

రేపటి వరకు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం



భైంసాలో ఓటేసేందుకు క్యూలో ఉద్యోగులు

భైంసాటౌన్: లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఈనెల 10వరకు గడువు పెంచారు. ఈనెల 3న పోస్టల్ బ్యాలెట్ ప్రారంభం కాగా, భైంసా ఆర్డీవో కార్యాలయంలో ఓటరు ఫెసిలియేషన్ కేంద్రం ఏర్పాటు చేశారు. భైంసా డివిజన్ పరిధిలో 1,645 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా, బుధవారం వరకు 1,456 మంది ఓటు వినియోగించుకున్నారు. ఇంకా 189 మంది ఓటు వేయాల్సి ఉంది. ఈ నెల 3న 86మంది, 4న 312, 5న 192, 6న 370, 7న 286, 8న 210 మంది ఓటు వినియోగించుకున్నారు.

'ఉపాధి' పథకం కూలీలకు వరం



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కుంటాల: ఉపాధిహామీ పథకం కూలీలకు వరంలా మారిందని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ఏప్రిల్ 2023 నుంచి 2024 మార్చి 31 వరకు రూ.4 కోట్లతో చేపట్టిన పనులపై 14వ సామాజిక తనిఖీలో భాగంగా ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నికల నిబంధనలు పాటిస్తూ ఆమె మాట్లాడారు. కూలీలకు ఉపాధి కల్పించడంలో రాష్ట్రంలోనే జిల్లా అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. జిల్లాలో కుంటాల మండలం ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఏపీవో గట్టుపల్లి నవీన్, సిబ్బందిని అభినందించారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సామాజిక తనిఖీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, ఇది సిబ్బంది పనితీరుకు నిదర్శనమని ప్రశంసించారు. ఎంపీడీవో అబ్దుల్ రహీం, హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, ఎస్సార్పీ భగవంతరావు, ఏపీవో గట్టుపల్లి నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

లింబా (బీ) గ్రామంలోని ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీవో విజయలక్ష్మి పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. లింబా (కే)లోని మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. వసతులు కల్పించి, పచ్చని తోరణాలు కట్టి ఓటర్లను ఆహ్వానించాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీవో అబ్దుల్ రహీం, హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, ఏపీఎం అశోక్, పంచాయతీ కార్యదర్శి గంగాప్రసాద్, సీసీ యూసఫ్ తదితరులున్నారు.

విద్యాశాఖ కమిషనర్‌పై చర్య తీసుకోవాలి

నిర్మల్ రూరల్: టెట్ వివాద పరిష్కారంపై విద్యాశాఖ కమిషనర్ నిర్లక్ష్యాన్ని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు తీవ్రంగా ఖండించారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ సంఘ భవనంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు టెట్ అవసరం లేదని పేర్కొంటూ ఏప్రిల్ 8న ఎస్సీఈ ఆర్టీ పంపిన వివరణ లేఖను విద్యాశాఖ కమిషనర్ దేవసేన బయటకు వెల్లడించలేదని ఆరోపించారు. ఈ విషయం తెలియని చాలామంది ఉపాధ్యాయులు అవసరం లేకున్నా టెట్ కోసం పరీక్ష ఫీజు చెల్లించి ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాలు పదేపదే అడిగినప్పటికీ ఇంకా క్లారిఫికేషన్ రాలేదని బుకాయించారని విమర్శించారు. విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకుని, అప్లికేషన్ ఫీజు తిరిగి చెల్లించాలని కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్, ప్రధాన కార్యదర్శి పెంట అశోక్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

పోటీ వాళ్లది.. పోరు వీళ్లది

- ముమ్మరంగా ఎంపీ ఎన్నికల ప్రచారం
- ఎమ్మెల్యేగా గెలిచిన.. ఓడినోళ్లకు పోటీ
- పట్టు నిలుపుకొనే పనిలో ఎమ్మెల్యేలు
- ప్రతీకారం తీర్చుకునేలా పరాజితులు
- అభ్యర్థులకు మించి జోరుగా ప్రచారం



నిర్మల్: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం 'అసెంబ్లీ' విజేతలు వర్సెస్ పరాజితులు అన్నట్లుగా సాగుతోంది. మూడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు, ప్రత్యర్థి పార్టీల నేతలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఎంపీ అభ్యర్థుల కంటే ఎక్కువగా వీరి పోరే సీరియస్‌గా కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు పట్టు నిలుపుకొనే ప్రయత్నంలో ఉండగా, తమ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకుని అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని ప్రత్యర్థులు ప్రయత్నిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీచేసిన వాళ్లు కాంగ్రెస్‌లో చేరడంతో హస్తం బలం కాస్త పెరిగింది. అదనంగా ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అధిక సమయం ఆదిలాబాద్ పార్లమెంట్‌కే వెచ్చిస్తున్నారు. అందుకే బీజేపీ ఎమ్మెల్యేలు మరింత శ్రమించాల్సి వస్తోంది.

నిర్మల్‌లో పోటాపోటీ..

తమ పార్టీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించుకునేందుకు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నిర్మల్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ తరఫున నిర్మల్ నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అందరికంటే ముందు ఆయన ప్రచారాన్ని ప్రారంభించారు. ఇటీవల హస్తం పార్టీలో చేరిన మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కూడా మూడు, నాలుగు రోజులుగా ప్రచార వేగాన్ని పెంచారు. జోరుగా చేరికలు చేపడుతూ పల్లెల్లో దూసుకుపోతున్నారు. తన నియోజకవర్గంలో బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఈ ఇద్దరు రాజకీయ ఉద్దండులను ఎదుర్కొంటున్నారు. వీరిద్దరినీ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ తేడాతో ఓడించారు. ఇప్పుడు అల్లోల, కూచాడి ఒకే పార్టీ కోసం శ్రమిస్తున్నారు. తమ మధ్య వైరుధ్యమున్నా.. వేర్వేరుగా ప్రచారం చేస్తున్నా.. అధిష్ఠానం ఆదేశాల మేరకు పార్టీ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం శ్రమిస్తున్నారు. తమ అభ్యర్థిని గెలిపించుకుని 'ఏలేటి'కి దెబ్బ కొట్టడంతో పాటు పార్టీలో తమ పరపతిని పెంచుకునేందుకూ వారు ప్రయత్నిస్తున్నారు. ఈ ఇద్దరి ప్రచార వేగాన్ని 'ఏలేటి' దాటే ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడ మాజీమంత్రి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్ తరఫున ప్రచారానికి ఈ స్థాయి ఉన్న నాయకులెవరూ లేకపోవడం గమనార్హం.

ముధోల్‌లో ముగ్గురి మధ్య..

మహారాష్ట్ర సరిహద్దు నియోజకవర్గమైన ముధోల్‌లో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా పాతింది. ఎమ్మెల్యేగా గెలిచిన రామారావుపటేల్ పార్టీ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నారు. తన బలగాన్ని మొత్తం ప్రచారంలోకి దింపారు. అసెంబ్లీపోరులో ఆయన చేతిలో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావుపటేల్ ఇద్దరూ ఒకే పార్టీలో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత విఠల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యేలిద్దరూ తమ ప్రత్యర్థి రామారావుపటేల్‌ను దెబ్బతీసేందుకు పార్లమెంట్‌పోరులో తీవ్రంగా శ్రమిస్తున్నారు. వీరిద్దరికీ సమన్వయం లేకపోయినా.. ఎవరికి వారు కాంగ్రెస్ గెలుపు కోసమే పనిచేస్తున్నారు. వీరికి అదనంగా ముధోల్ మరో మాజీ ఎమ్మెల్యే, కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలాచారి తోడయ్యారు. ఆయన కూడా ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. ఇలా.. ఇక్కడ ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలను ప్రస్తుత ఎమ్మెల్యే రామారావుపటేల్ ఎదుర్కొంటూ తమ పార్టీ ఎంపీ అభ్యర్థికి మెజార్టీ తీసుకువచ్చేందుకు యత్నిస్తున్నారు.

ఖానాపూర్‌లో మూడుపార్టీలు..

జిల్లాలోని నిర్మల్, ముధోల్ నియోజకవర్గాలతో పోలిస్తే ఖానాపూర్‌లో పరిస్థితి కొంత వేరుగా ఉంది. ఇక్కడ బీఆర్‌ఎస్ తరఫున కూడా ప్రచారం కొనసాగుతోంది. ఆ పార్టీ నుంచి అసెంబ్లీలో పోటీచేసిన కేటీఆర్ మిత్రుడు జాన్సన్‌నాయక్ తమ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు కోసం ప్రచారం చేస్తున్నారు. మరోవైపు బీజేపీ సీనియర్ నేత రాథోడ్ రమేశ్ కూడా తమ అభ్యర్థి గోడం నగేశ్ కోసం గ్రామగ్రామాన ప్రచారంలో పాల్గొంటున్నారు. వీరిద్దరినీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించిన ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ కాంగ్రెస్ పార్టీకి ఈ నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో కలిసి బొజ్జుపటేల్ నిర్మల్ జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ కోసం ప్రచారం చేస్తున్నారు. ఆయనను దెబ్బకొట్టాలంటే తమ నియోజకవర్గంలో తమ పార్టీ అభ్యర్థులకు మెజార్టీ తీసుకురావాలని రాథోడ్ రమేశ్, జాన్సన్ నాయక్ శ్రమిస్తున్నారు.

15 రోజుల్లో తీర్పు అమలు చేయండి

- లేకుంటే జైలుకు వెళ్లక తప్పదు
- నిర్మల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు హైకోర్టు హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: ఆరోగ్య కార్యకర్తలకు సంబంధించి గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను 15 రోజుల్లోగా అమలు చేయాలని.. లేని పక్షంలో నిర్మల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హైకోర్టు హెచ్చరించింది. చట్టప్రకారం ఆరోగ్య కార్యకర్తల వేతనాలు చెల్లించాలని కలెక్టర్, కమిషనర్‌కు హైకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసింది. అయినా వారి ఆ ఆదేశాలు అమలు చేయకపోవడంతో నిర్మల్ జిల్లాకు చెందిన హెల్త్ వర్కర్ వజ్రాదేవితో పాటు మరో 28 మంది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ మాధవీదేవి తుది ఉత్తర్వులు వెలువరించారు. 'నిర్మల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు చివరి అవకాశం ఇస్తున్నాం. 15 రోజుల్లోగా గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలి. ఒకవేళ అమలు చేయని పక్షంలో కలెక్టర్ నెల రోజులు, కమిషనర్ 15 రోజుల పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. రూ.2వేలు, రూ.వెయ్యి చొప్పున జరిమానా కూడా కట్టాలి. ఒకవేళ జరిమానా చెల్లించకుంటే మరో పది రోజులు, వారం చొప్పున కలెక్టర్, కమిషనర్ సాధారణ జైలు శిక్ష అనుభవించాలి. తప్పుడు సమాధానం ఇచ్చినందుకు కూడా వారు శిక్షకు అర్హులు. దీనిపై వారికి నోటీసులు జారీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశిస్తున్నాం. ఈ తీర్పుపై అప్పీల్‌కు వెళ్లేందుకు కోర్టు సెలవుల కారణంగా రెండు నెలల సమయం ఇస్తున్నాం. అప్పటి వరకు తీర్పు అమలును సస్పెన్షన్‌లో ఉంచుతున్నాం' అని తీర్పులో న్యాయమూర్తి పేర్కొన్నారు.

రుణ పరిమితి ఖరారు

- 124 రకాల పంటలకు వర్తింపు
- ఈసారి స్వల్పంగా పెంపుదల
- ఏటా పెరుగుతున్న పెట్టుబడి
- తగినంత పెంచలేదన్న రైతులు



నిర్మల్‌చైన్‌గేట్: ఈ ఆర్థిక సంవత్సరం 2024–25కు గాను బ్యాంకర్లు, నాబార్డు వ్యవసాయ రుణ ప్రణాళికను ఖరారు చేశారు. రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ సిఫారసుల మేరకు రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ పంట రుణ పరిమితిని పెంచింది. రాబోయే వానాకాలం, యాసంగి పంటలకు సంబంధించి 10శాతం వరకు రుణ పరిమితి పెంచింది. దీనిని 124 రకాల పంటలకు వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా, ఏటేటా పెరుగుతున్న సాగు ఖర్చులకు తగినట్లు రుణ పరిమితి లేదని రైతులు అసంతృప్తి వ్యక్తంజేస్తున్నారు.

పంపిణీ లక్ష్యం నెరవేరితేనే..

సాగునీటి కల్పన, వ్యవసాయ యాంత్రీకరణ, పాడి పరిశ్రమ, ఎద్దులు, ఎడ్లబండ్లు భూముల అభివృద్ధి విత్తనోత్పత్తి, సేంద్రియసాగు రుణాలు చాలామంది రైతులకు అందడం లేదు. 2024–25లో జిల్లాలో రైతులకు రుణ ప్రణాళికను నాబార్డు అందించేందుకు నివేదిక విడుదల చేసింది. పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాల పంపిణీ లక్ష్యం చేరుకుంటేనే రైతులకు ఆర్థిక చేదోడుగా ఉంటుంది. బ్యాంకులు పంట రుణ పరిమితిని పెంచి ఇవ్వడంతో పాటు సక్రమంగా చెల్లించిన రైతులకు 30శాతం రుణాన్ని పెంచి ఇచ్చే వీలుంది. జిల్లాలో నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొంది ఇదివరకు రుణం పొందనివారు వేలల్లో ఉన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రూ.లక్ష రుణమాఫీ వర్తించని వారు జిల్లాలో వేల మంది ఉండగా, నూతన ప్రభుత్వం చేయాల్సిన రూ.2లక్షల రుణమాఫీపై అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో పంట రుణాలకు కేంద్రం రాయితీ ఇస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం కూడా వడ్డీ రాయితీని కొనసాగించాలని, ఎప్పటిలాగే వడ్డీ బకాయిని రీయింబర్స్‌మెంట్‌గా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

4.20 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో గత వానాకాలంలో 4.20 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేశారు. ఇందులో వానాకాలంలో లక్ష ఎకరాల్లో వరి, 1.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో కొనుగోళ్లు కూడా ప్రారంభమయ్యాయి. మరోవైపు ప్రణాళిక ఖరారు కావడంతో రైతులు రుణాలు పొందడానికి సిద్ధమవుతున్నారు.

వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లో రుణ పరిమితి ఖరారు చేస్తున్నా రైతులు బ్యాంకుల ద్వారా పూర్తి స్థాయిలో రుణాలు అందుకోలేక పోతున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. వ్యవసాయం కోసం రైతులకు జిల్లాలో అనుకూల పరిస్థితులున్నా ప్రైవేట్ వ్యక్తుల ద్వారా రుణాలు పొందక తప్పడం లేదు. బ్యాంకుల్లో ప్రధానంగా ప్రభుత్వం రుణమాఫీ ఆశలు చూపుతుండడంతో పాతవి చెల్లించి కొత్తరుణాలు తీసుకుంటే మాఫీ వర్తించదనే అనుమానంతో రైతులు వేచి చూస్తున్నారు. దీంతో రుణాల లక్ష్యం కూడా నెరవేరడం లేదని తెలుస్తోంది.

కొత్త రుణ ప్రణాళిక ఇలా..

వరి సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.43 వేల నుంచి రూ.45వేలకు రుణపరిమితి పెంచారు. శ్రీవరికి రూ.36 వేల నుంచి రూ.38 వేలకు, విత్తన వరికి రూ.48 వేల నుంచి రూ.50 వేలకు పెంపు చేశారు. జొన్నకు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు, సజ్జకు రూ.15 వేల నుంచి రూ.17 వేలకు పెంచారు. మక్కకు రూ.32 వేల నుంచి రూ.34 వేలు, కందికి రూ.22 వేల నుంచి రూ.24 వేలు, మినుముకు రూ.19 వేల నుంచి రూ.21 వేలకు, పెసరకు రూ.20 వేల నుంచి రూ.22 వేలకు పెంచేశారు. వేరుశనగకు రూ.28 వేల నుంచి రూ.30 వేలు, నువ్వుకు రూ.19 వేల నుంచి రూ.21 వేలకు, పత్తికి రూ.44 వేల నుంచి రూ.46 వేలకు, చెరుకుకు రూ.82 వేల నుంచి రూ.84 వేలకు, అరటికి రూ.95 వేల నుంచి రూ.97 వేలకు పెంచారు. కూరగాయలకు రూ.33 వేల నుంచి రూ.66 వేల వరకు, మామిడికి రూ.42 వేల నుంచి రూ.44 వేలకు, జామకు రూ.45 వేల నుంచి రూ.47 వేలకు పెంచేశారు. పూల మొక్కలకు రూ.50 వేల నుంచి రూ.62 వేలకు, మిర్చి తోటలకు రూ.30 వేల నుంచి రూ.33వేల వరకు పెంచారు.

అధికారులను సంప్రదించాలి

నూతన ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వం అనుమతించిన మేరకు పంట రుణ పరిమితిని పెంచి రైతులకు అధిక మొత్తం అందించేలా చర్యలు తీసుకుంటాం. ఇంకా పంట రుణాలు పొందని వారు వ్యవసాయాధికారులు, బ్యాంకులను సంప్రదించాలి.

– చంద్రశేఖర్, లీడ్ బ్యాంక్ మేనేజర్

రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

నిర్మల్‌చైన్‌గేట్: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ సరఫరా తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోళ్ల ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని, ధాన్యం మిల్లులకు తరలించేందుకు ఆదనపు లారీలు సమకూర్చుకోవాలని సూచించారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్యాడీ క్లీనింగ్ యంత్రాల ద్వారా ధాన్యాన్ని శుభ్రపరిచేలా చూడాలని సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో కేంద్రాలను పరిశీలించి రోజువారీ నివేదికలు అందించాలని ఆదేశించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఎంఆర్ సరఫరా వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం మిల్లర్ల వారీగా లక్ష్యం, సరఫరా, పెండింగ్ తదితర అంశాలపై చర్చించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఎస్వో నందిత, డీఎం సివిల్ సప్లయీస్ శ్రీకళ, డీసీవో నర్సయ్య, డీఏవో అంజిప్రసాద్, మార్కెటింగ్ ఏడీ అశ్వాక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అబద్ధాల్లో కేసీఆర్‌ను మించిన రేవంత్

- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్
- ఖానాపూర్‌లో రోడ్‌షో, కార్నర్ మీటింగ్



రాజాసింగ్‌కు గద ఇస్తున్న బీజేపీ నాయకులు

ఖానాపూర్: అబద్ధాల్లో మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మించిపోయారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శించారు. బుధవారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని కార్నర్‌మీటింగ్‌లో మాట్లాడారు. మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నట్లు ఆరోపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న సీఎం రేవంత్‌కు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన గ్యారంటీలు ఏమయ్యాయో రేవంత్ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని, దేశాభివృద్ధి, దేశ రక్షణకు మూడోసారి మోదీని ప్రధానిగా గెలిపించాలని కోరారు. దేశంలో బీజేపీ గెలిచే సీట్లలో ఆదిలాబాద్ కూడా ఉంటుందని ధీమా వ్యక్తంజేశారు. ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఏ బూత్‌లో ఎక్కువ ఓట్లు వస్తే వారిని తానే స్వయంగా సన్మానిస్తానని చెప్పారు. 'పాకిస్తాన్ దగ్గర అటం బాంబు' అంటూ కశ్మీర్ మాజీ సీఎం ఫారూక్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమన్నారు. ప్రతీ భారత పౌరుడు అనుబాంబుతో సమానమని హెచ్చరించారు. పాకిస్తాన్ గురించి గొప్పగా చెప్పే కాంగ్రెస్ నాయకులు ఈ దేశంలో ఉండడం అవసరమా? అని ప్రశ్నించారు. అనంతరం నాయకులు రాజాసింగ్‌ను సన్మానించారు. ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు రితీశ్ రాథోడ్, నాయకులు అంకం మహేందర్, ఆకుల శ్రీనివాస్, నాయిని సంతోష్, తోకల బుచ్చన్న, టేకు ప్రకాశ్ తదితరులున్నారు.

అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తా

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



లోకేశ్వరం: మాట్లాడుతున్న మంత్రి సీతక్క

లోకేశ్వరం: అందుబాటులో ఉండి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని లక్ష్మీ కల్యాణ మండపంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించగా, సీతక్క హాజరై మాట్లాడారు. పిప్రి ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేసి సాగు నీరందించేలా చూస్తానని తెలిపారు. వచ్చే యాసంగి నాటికి అర్లి వంతెన నిర్మాణ పనులు పూర్తి చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నామని చెప్పారు. మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నారాయణ్‌రావు పటేల్, విఠల్‌రెడ్డి, డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ జట్టు అశోక్, నాయకులు ఆనందరావు పటేల్, పండరిగౌడ్, ప్రేంనాథ్‌రెడ్డి, గడ్డం సుదర్శన్‌రెడ్డి, సాయారెడ్డి, భోజన్న, రత్నాకర్‌రావు, భుజంగ్‌రావు, కపిల్, శంకర్ చంద్రే, వినోద్, దత్తు, గంగాధర్, నర్సారెడ్డి, షఫీ, సుధాకర్, శ్రీనివాస్, రాంచందర్‌రావు, శేఖర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, ముత్తగౌడ్ తదితరులున్నారు.

బడి, గుడి అభివృద్ధి బాధ్యత నాదే..

లక్ష్మణచాంద: ఉమ్మడి జిల్లాలోని ప్రతీ గుడి, బడి అభివృద్ధి బాధ్యత తనదేనని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. మండలంలోని రాచపూర్, వడ్యాల్, బాబాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి సుగుణ మాట్లాడుతూ.. తనను ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజాసమస్యలపై పోరాడతానని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్, నాయకులు ఈటెల శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, లింగారెడ్డి, రాంరెడ్డి, గంగాధర్‌గౌడ్, రవి, భీమన్న తదితరులు పాల్గొన్నారు.



అపూర్వం.. విద్యార్థుల సమ్మేళనం

సోన్: మాదాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో 2003–2004 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డవారంతా పాఠశాలలో కలుసుకున్నారు. పాఠశాలలో చదవిన జ్ఞాపకాలను నెమరువేసుకుని రోజంతా సరదాగా గడిపారు. ఆప్యాయంగా పలకరించుకుని ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. అప్పటి గురువులను ఆహ్వానించి సన్మానించారు. అనంతరం నృత్యాలు చేసి ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు పోశెట్టి, సదానందం, రమేశ్, శంకర్, వేణుమాధవ్, సుదార్‌సింగ్ పాల్గొన్నారు.

నేటి కార్నర్ మీటింగ్‌కు కేటీఆర్




హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

భైంసాటౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం భైంసాలో నిర్వహించే కార్నర్ మీటింగ్‌కు హాజరు కానున్నట్లు ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్, ముధోల్ ఎన్నికల ఇన్‌చార్జి రాథోడ్ జనార్దన్ తెలిపారు. మీటింగ్‌కు దాదాపు 10వేలకుపైగా జనం హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు కేటీఆర్ హెలికాప్టర్ ద్వారా భైంసాకు చేరుకుంటారని, అక్కడి నుంచి పాత పోస్టాఫీస్ వద్ద నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు ముధోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు విలాస్ గాదేవార్, పీ రమాదేవి, లోలం శ్యాంసుందర్, డాక్టర్ కిరణ్ కొమ్రేవార్‌తో కలిసి బుధవారం హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. సాయంత్రం 5 గంటలకు రోడ్‌షో ప్రారంభమవుతుందని, నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సైనిక్ స్కూల్‌కు ఎంపిక

లోకేశ్వరం: మండలంలోని పోట్‌పల్లి గ్రామానికి చెందిన బ్యాగరి కార్తీక్ ఆరోతరగతి చదివేందుకు కరీంనగర్‌లోని టీఎస్ డబ్ల్యూఆర్ సైనిక్ పాఠశాలకు ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో కార్తీక్ ర్యాంక్ సాధించడంతో గ్రామస్తులు అతడిని అభినందించారు.



కార్తీక్

క్లుప్తంగా

బైక్‌పై తిరుగుతూ మంత్రి ప్రచారం



బైక్‌పై వెళ్తున్న మంత్రి సీతక్క

లక్ష్మణచాంద: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి సీతక్క బుధవారం మండలంలోని బాబాపూర్, వడ్యాల్, రాచాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ముందుగా వడ్యాల్ చెరువులో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడిన అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకుడు నరేష్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై ఎక్కి చెరువు అవతలివైపు ఉన్న రాచాపూర్ కూలీల వద్దకు వెళ్లారు. కూలీలతో మాట్లాడి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

కాంగ్రెస్‌లో చేరిన పీఏసీఎస్ డైరెక్టర్లు



సీఎం రేవంత్‌రెడ్డితో నాయకులు

బోథ్: మండలానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్లు గొర్ల రాజు యాదవ్, చట్ల ఉమేష్‌తో పాటు ఎంపీటీసీ చట్ల రజిని, పలువురు బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా, బోథ్ సహకార సంఘం డైరెక్టర్‌గా ఉన్న గొర్ల రాజు యాదవ్ కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నాడు. వారితో పాటు బీజేపీ నాయకులు అనిల్ అప్ప, మల్లెపూల లింగారెడ్డి, విఠల్ కాంగ్రెస్‌లో చేరారు.

ప్రమాదవశాత్తు స్కూటీ దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని నిర్మల్-భైంసా రహదారిపై బుధవారం ప్రమాదవశాత్తు స్కూటీ దగ్ధమైంది. కడెంకు చెందిన రమేశ్ భైంసాకు వస్తుండగా స్కూటీ వేడెక్కడం గమనించాడు. దీంతో స్థానిక గణేశ్ ఇండస్ట్రీస్ వద్ద వాహనం పక్కకు నిలిపి చూస్తుండగానే ఒక్కసారిగా స్కూటీ నుంచి మంటలు చెలరేగాయి. దీంతో వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారమివ్వగా భైంసా అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి సుందన్న సిబ్బందితో కలిసి సంఘటనాస్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. కాగా అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది.

12వ తేదీలోగా రండి...



జమ్మూ యాత్ర నుంచి తిరుగు పయనమైన నిర్మల్ వాసులు

పోలింగ్‌కు ముందే వచ్చేస్తాం..



ఏటా వేసవి సెలవుల్లో నాలుగైదు కుటుంబాల మిత్రులంతా కలిసి విజ్ఞాన విహార యాత్రలకు వెళ్తుంటాం. ఈసారి నార్త్ ఇండియాలోని జమ్మూ తదితర శీతల కేంద్రాలను విహార స్థలాలను సందర్శించాం. మే 13న ఎన్నికలు ఉండడంతో అంతకంటే ముందుగానే టూర్ ముగిసేలా ప్లాన్ చేసుకున్నాం.
– స్వామిరెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, నిర్మల్

- ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలి
- ఓటింగ్ శాతం పెంచాలంటున్న ఎన్నికల అధికారులు

నిర్మల్‌ఖిల్లా: ప్రస్తుతం విద్యా సంస్థలకు వేసవి కాలం సెలవులు కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కూడా జరగనుంది. అయితే వేసవి సెలవుల్లో విద్యార్థులు, ఉద్యోగులు విహారయాత్రలు, తీర్థయాత్రలకు వెళ్లడానికి ప్రణాళికలు వేసుకుంటారు. ఉద్యోగ ఉపాధ్యాయులు శీతల ప్రాంతాలైన ఊటీ, గోవా, కొడైకెనాల్, జమ్మూ తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇదే క్రమంలో ఈ నెల 13న సోమవారం రోజున లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. అయితే ఇప్పటికే జిల్లా నుండి చాలామంది విహారయాత్రలకు కుటుంబ సమేతంగా వెళ్లారు. అయితే పోలింగ్ రోజు కంటే ముందే స్వస్థలాలకు చేరుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారులు పిలుపునిస్తున్నారు. ఇదే అంశంపై మంగళవారం స్వీప్ ఆధ్వర్యంలో 5కే రన్ కూడా నిర్వహించారు.

విహారయాత్రల నుండి తిరుగుముఖం..

సెలవులను సంతోషంగా గడిపిన వారంతా పోలింగ్ రోజు కంటే ముందే ఇంటికి చేరుకునేలా ప్లాన్ చేసుకున్నారు. ఓటుహక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని పోలింగ్ రోజు కల్లా స్వస్థలాలకు తరలిరానున్నారు. జిల్లా నుండి వేసవి సెలవుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, ఉపాధి కోసం హైదరాబాద్, వరంగల్, ముంబై, ఢిల్లీ, గుజరాత్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డ వారు కూడా ఓటుహక్కును వినియోగించుకోవడం కోసం స్వస్థలాలకు చేరుకుంటున్నారు. గతంలో కంటే ఈసారి ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లా ఎన్నికల అధికారులు కూడా ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. ఎన్నికల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కూడా అత్యధిక శాతం పోలింగ్ జరిగేలా అవగాహన కల్పిస్తున్నారు ఎన్నికల మహాక్రతువులో ఓటుహక్కు అత్యంత కీలకమని ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు.

ఈ ఉదంతం స్ఫూర్తివంతం

ఇంట్లో నుంచి కదల్లేని స్థితిలో ఉన్న వ్యక్తి ఓట్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్న మరునటి రోజే మృతి చెందిన ఘటన నిర్మల్ రూరల్ మండలంలోని వెంగ్వాపేటలో చోటు చేసుకుంది. ఈ నెల 3న హనుమంతరావు (68) ఎన్నికల అధికారుల సమక్షంలో ఇంటి వద్దనే ఓటు వేశారు. అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించి 4న తెల్లవారు జామున కన్నుమూశాడు. ఓటు వేయడంలో అలసత్వం ప్రదర్శించే పలువురిలో స్ఫూర్తిని రగిలించింది.

రోడ్డెక్కిన చామన్‌పెల్లి రైతులు

- ధాన్యం కొనుగోలు, తరలింపులో జాప్యాన్ని నిరసిస్తూ ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

లక్ష్మణచాంద: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కోరుతూ మండలంలోని చామన్‌పల్లి రైతులు బుధవారం రోడ్డెక్కి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రం వద్ద సంచులు ఇచ్చే ముందు తేమ శాతం 18 ఉంటే సకాలంలో తూకం వేయకపోవడంతో తూకం వేసే క్రమంలో 40 కిలోల సంచి కేవలం 37 కిలోలు వస్తుందని రైతులు వాపోతున్నారు. తూకం వేసిన ధాన్యం సకాలంలో తరలించడం లేదన్నారు. దీనిపై మంగళవారం అధికారులకు విన్నవించినా ఎలాంటి స్పందన లేదని, అందుకే ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన విరమించాలని రైతులకు సూచించగా ఉన్నతాధికారులు వచ్చి తమ సమస్య పరిష్కరించే వరకు విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. చివరకు పౌరసరఫరాల అధికారి ముత్యంరెడ్డి వచ్చి వెంటనే నాలుగు లారీలు పంపిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

విభజించి పాలించడమే బీజేపీ నైజం

- కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి



పార్టీలో చేరిన వారితో వేణుగోపాలాచారి

కైలాస్‌నగర్: కుల, మతాల ప్రతిపాదికన విభజించి పాలించడమే బీజేపీ నైజమని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజాసేవాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పట్టణంలోని 33వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి సయ్యద్ సాకిబ్ అలీతో పాటు పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కాంగ్రెస్ కండువాలను కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సర్కార్ రిజర్వేషన్ల రద్దుకు, రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. మళ్లీ పొరపాటున ఆ పార్టీకి ఓటేసి గెలిపిస్తే మన మనుగడ ప్రశ్నార్థకంగా మారి జీవనం కష్టసాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, నాయకులు గిమ్మ సంతోష్‌రావు, లోక ప్రవీణ్‌రెడ్డి, మహ్మద్ రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేసి చూపిస్తాం

- మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్



మాట్లాడుతున్న రాములు నాయక్

తలమడుగు: రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపిస్తామని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని కజ్జర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇస్తే తప్పడన్నారు. గల్లీలో కాంగ్రెస్, ఢిల్లీలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రానుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులకు పదవులు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, తలమడుగు జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్, ఎంపీటీసీ గోదావరి కమలాకర్, పూర్ణచందర్, ప్రకాష్ రావు, మాజీ జెడ్పీటీసీ బాపన్న, శ్రీనివాస్, నారాయణ, మాజీ ఎంపీటీసీ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం'



మాట్లాడుతున్న నక్క రాందాస్ మాదిగ

ఎదులాపురం: కాంగ్రెస్ పార్టీతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం అవుతుందని మాదిగ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ నక్క రాందాస్ మాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ 380 రోజులవుతున్నా వర్గీకరణ ఊసేఎత్తడం లేదన్నారు. ఎన్నికలు వస్తేనే మంద కృష్ణ మాదిగకు వర్గీకరణ గుర్తుకు వస్తుందని, ఏదో ఒక పార్టీకి అమ్ముడుపోయి మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. రాజ్యాంగ రక్షణ, వర్గీకరణ కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యం అవుతుందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే తమ మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో మనోజ్ కుమార్, మోతె బారిక్‌రావు, ప్రసన్నకుమార్, అశోక్, భూమన్న, మహేందర్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఎంగ్లాపూర్ గ్రామస్తుల బైండోవర్



బైండోవర్ చేస్తున్న పోలీసులు

పెంబి: తమ గ్రామంలో సరైన సౌకర్యాలు లేవంటూ ఎంగ్లాపూర్ గ్రామ పంచాయతీలోని గుమ్మెన, కొలాంగూడ, నాయకపుగూడ గ్రామస్తులు అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరించడంతో జిల్లా, మండల అధికారుల చొరవతో ఎట్టకేలకు ఓటు వేశారు. దీంతో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముందస్తుగా పోలీసుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్‌వో ముందు సత్ప్రవర్తన కలిగి ఉండేందుకు ఎంగ్లాపూర్ గ్రామానికి చెందిన లింగన్న, మల్లేశ్, రాజన్నను బైండోవర్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి గొడవలు జరగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఐడియా అదిరింది



బైక్‌పై సీలింగ్ ఏర్పాటు చేసుకున్న యువకుడు

నిర్మల్‌టౌన్: జిల్లాలో భానుడు తన ప్రతాపం చూపిస్తుండడంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. వాహనదారులు ఎండ వేడిమి తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఎండల నుంచి ఉపశమనం పొందడానికి రూ.7వేలు వెచ్చించి ఆన్‌లైన్‌లో సీలింగ్ కొనుగోలు చేసి వాహనానికి ఏర్పాటు చేసుకున్నాడు. దీనివల్ల ఎండ వేడి నుంచి ఉపశమనం లభిస్తుందని తెలిపాడు.

బెల్లం, పటిక పట్టివేత

కడెం: ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నరసింహారెడ్డి ఆదేశానుసారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎంఏ.రజాక్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని దోస్తునగర్‌లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 14 క్వింటాళ్ల బెల్లం, 60 కిలోల పటిక పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన బెల్లం, పటిక విక్రయిస్తున్న బండ్ల శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు అక్బర్ హుస్సేన్, నజీర్ హుస్సేన్, లక్ష్మణ్, ఎస్సైలు వసంతరావు, సింధు, సిబ్బంది, పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ నర్సింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైంది. ఈ నెల 4న ఆమె స్వగ్రామం ఉట్నూర్ మండలంలోని కొత్తగూడకు వెళ్తానని ప్రిన్సిపాల్‌కు సెలవు పత్రం ఇచ్చింది. బుధవారం తన తండ్రి ఆమె కోసం కళాశాలకు రాగా ఇటీవల సెలవు పత్రం ఇచ్చి ఇంటికి వెళ్లిందని ప్రిన్సిపాల్ చెప్పడంతో వెంటనే టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏఎస్సై ముకుంద్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

కోటపల్లి: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన డొబ్బల సంపత్ ద్విచక్ర వాహనంపై పార్‌పల్లి జాతీయ రహదారి మీదుగా చెన్నూర్‌కు వెళ్తుండగా చీకట్లో ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంలోంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో అటుగా వెళ్తున్న బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు మారిశెట్టి విద్యాసాగర్ అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. సంపత్‌ను అంబులెన్స్‌లో తరలించడంతో పాటు రూ.5వేలు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

సోన్: ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జడ్జి అజయ్ కుమార్ జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు కైర్ట అధికారి నర్సింగ్‌నాయక్ తెలిపారు. 2016లో సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన ఒంటెద్దుల సాయమ్మ (62)ను మహ్మద్ అల్లావుద్దీన్ నిర్లక్ష్యంగా లారీ నడుపుతూ ఢీకొట్టడంతో మృతి చెందింది. సాయమ్మ కుమారుడు సాయన్న అప్పట్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై పున్నం చందర్ కేసు నమోదు చేశారు. ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అజయ్ కుమార్ నిందితుడికి రెండు నెలల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లోకేశ్వరం: ఈ నెల 1న గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై దిగంబర్ తెలిపారు. మండలంలోని సాథ్గాం గ్రామానికి చెందిన ఉమ్మెడ నాగేష్ (51) భార్య జ్యోతి కొన్నేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటినుంచి మానసికంగా కృంగిపోయిన నాగేష్ జీవితంపై విరక్తి చెందాడు. ఈనెల 1న పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆస్ట్రేలియాలో ఇంద్రవెల్లి వ్యాపారి మృతి




కిశోర్(ఫైల్)

ఇంద్రవెల్లి: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి జన్నావార్ కిషోర్ (68) ఆస్ట్రేలియాలో అనా రోగ్యంతో మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 3న ఆస్ట్రేలియాలోని అడిలైడ్ సిటీలో ఉంటున్న తన కుమారుడు ఆశిష్ వద్దకు వెళ్లిన కిషోర్ తీవ్ర అస్వస్థతకు గురై అక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని వారం రోజుల్లో స్వగ్రామానికి తీసుకురానున్నట్లు వారు పేర్కొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ ధోబి కాలనీకి చెందిన కదూరి స్వామి (35) నాలుగేళ్లుగా శాంతినగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. కొంత కాలంగా ఆరోగ్య పరిస్థితి బాగాలేదు. అతనికి ఇంకా పెళ్లి కూడా కాలేదు. ఒంటరిగా ఉంటున్న ఆయన అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన ఇంటి యజమాని మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుని సోదరుడు ప్రభుదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

వడదెబ్బతో ఒకరి మృతి



రాములు (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని వడూర్‌లో వడదెబ్బతో ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సారంగాపూర్ మండలం బింబోలి(బి) గ్రామానికి చెందిన కందుకూరి రాములు (62) వడూర్‌లోని ఆయన వ్యవసాయ క్షేత్రాన్ని ఇతరులకు కౌలుకు ఇచ్చేందుకు వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో ఇదే గ్రామంలో ఉంటున్న రాములు బింబోలి(బి) గ్రామంలో స్థిరపడ్డాడు. ఎండలు అధికంగా ఉండడంతో వడదెబ్బకు గురై మృతి చెంది ఉండవచ్చని గ్రామస్తులు పేర్కొన్నారు.

ధాన్యం కమీషన్ పెండింగ్

- ఇబ్బందులు పడుతున్న మహిళా సంఘాల సభ్యులు



ధాన్యం తూకం పరిశీలిస్తున్న నిర్వాహకులు(ఫైల్)

పాతమంచిర్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులకు కమీషన్ డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 135 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 100 కేంద్రాలను మహిళా సంఘాల సభ్యులు నిర్వహిస్తున్నారు. ఇందుకు అవసరమైన సామాగ్రిని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం క్వింటాకు రూ.32 కమీషన్ ఇస్తుంది. ఇందులోనే నిర్వాహకులు టెంట్, ఫ్లెక్సీలు, నీటి వసతి, ట్యాబ్‌ల కొనుగోలు, తేమ కొలిచే సాధనాలు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. సెంటర్‌లో పని చేసినందుకు కూలీ కూడ కమీషన్ నుంచే తీసుకోవాల్సి ఉంటుంది.

సెంటర్‌ల నిర్వహణ ద్వారా వచ్చిన కమీషన్ నిర్వాహకులు కూలీ డబ్బులు, ఇతర ఖర్చులు పోనూ మిగిలిన మొత్తాన్ని మహిళా సంఘాల సభ్యులు రుణంగా తీసుకుని వడ్డీతో సహా మహిళా సంఘం ఖాతాలో జమ చేస్తారు. మహిళా సంఘాల ద్వారా 2022-24 ఖరీఫ్ సీజన్ వరకు 3,97,296 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. కానీ 2022-23 ఖరీఫ్, యాసంగి, 2023-24 ఖరీఫ్‌కు సంబంధించిన కమీషన్ రూ.2,38,57,694 ప్రభుత్వం విడుదల చేయలేదు. కొనుగోళ్ల సీజన్ ముగిసిన తర్వాత కమీషన్ డబ్బులు విడుదలవుతాయని నిర్వాహకులు ఆశపడినా కమీషన్ రాకపోవడంతో నిరాశే ఎదురౌతుందని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కమీషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

విడుదల చేయాలి

2020లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన కమీషన్ రూ.2 లక్షల వరకు రావాల్సి ఉంది. సొంత ఖర్చులతో సెంటర్ నిర్వహించాం, అప్పులు చేసి సామాగ్రి కొనుగోలు చేసుకున్నాం. నాలుగేళ్ల సెంటర్ నిర్వహణ తీసుకోలేదు. 2024 యాసంగి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. పెండింగ్ కమీషన్ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– గుద్రాల కళావతి, ప్యాడి సెంటర్ నిర్వాహకురాలు, దొనబండ

రూ.2 లక్షలు రావాలి

వరిధాన్యం కొనుగోలు కమీషన్ రూ.2 లక్షలు రావాల్సి ఉంది. కమీషన్ గురించి అధికారులను అడుగుతుంటే సమాధానం ఇవ్వడం లేదు. కష్టపడి సెంటర్ నడిపించాం. మా కష్టానికి ఫలితం దక్కడంలేదు. కమీషన్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాం.– ఆత్రం యశోద, సెంటర్ నిర్వాహకురాలు

భూమిలో కలిసిన ఇంకుడు గుంతలు



మట్టినిండిన ఇంకుడు గుంత

భీమారం: గతంలో భీమారం అడవుల్లో అటవీశాఖ నిర్మించిన ఇంకుడుగుంతలు ప్రస్తుతం భూమిలో కలిసి పోయాయి. దీంతో వర్షాకాలంలో వరద నీరు వాగుల్లోకి వృథాగా పోతోంది. పదిహేనేళ్ల క్రితం అటవీశాఖ వర్షం నీటిని వృథాగా పోనీయకుండా అక్కడక్కడా ఇంకుడు గుంతలు నిర్మించింది. దీంతో వర్షపునీరు అందులోనే నిల్వ ఉండి భూమిలోనే ఇంకిపోయేలా చర్యలు చేపట్టారు. కానీ వాటిలో ఉన్న మట్టిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో నేడు అవి మట్టితో నిండి పోయాయి. తిరిగి నిర్మించాల్సి ఉండగా వాటిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపడంలేదు. మరో నెలరోజుల్లో వర్షాలు కురియనున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఈజీఎస్ ద్వారా చేపడుతున్న ఉపాధి పనుల్లో భాగంగా అడవుల్లో ఇంకుడు గుంతలు నిర్మిస్తే బాగుంటుందని ప్రజలు సూచిస్తున్నారు.

దాడికి పాల్పడిన కేసులో ఒకరికి జైలు

మంచిర్యాలక్రైం: ముగ్గురిపై దాడి చేసి గాయపర్చిన వ్యక్తికి స్థానిక న్యాయమూర్తి ఆర్పిత మారంరెడ్డి ఐదేళ్ల జైలుశిక్ష రూ.వెయ్యి జరిమానా విధించినట్లు స్థానిక సీఐ బన్సీలాల్ తెలిపారు. 2016 సెప్టెంబర్ 17న మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘడ్పూర్ గ్రామ పంచాయతీలోని బాబానగర్‌కు చెంది న నంద్ర లక్ష్మణ్, అనిల్, అశోక్‌పై అదే గ్రామానికి చెందిన మనుబోతుల శ్రీనివాస్ గొడ్డలి, కత్తితో దా డిచేసి గాయపరిచాడు. లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై వేణుగోపాల్‌రావ్ శ్రీనివాస్‌పై కేసు న మోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పీపీ మదన్‌మోహన్ రావ్ సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి జైలుశిక్ష ఖరారు చేశారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

నిర్మల్‌టౌన్ : జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై రాజేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామానికి చెందిన ఐరవర్తి స్వర్ణలత తన భర్తతో కలిసి షాపింగ్‌కు కారులో నిర్మల్‌కు వచ్చింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కారును పార్క్ చేసి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుకనుంచి నంబర్ లేని బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అకాల వర్షానికి కూలిన ఇల్లు



ఖిరిడిలో కూలిన పెంకుటిల్లు

వాంకిడి: మంగళవారం ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షానికి మండలంలోని ఖిరిడి గ్రామంలో సురేష్‌కు చెందిన పెంకుటిల్లు కుప్పకూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సురేష్‌కు చెందిన ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. అకాల వర్షంతో తనకు సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఆస్తినష్టం జరిగిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.